రంజాన్ వేళలు
ఇఫ్తార్:-6:34 (మంగళవారం సాయంత్రం) | సహర్: 5:02 (బుధవారం ఉదయం)

నాలుగో యూనిట్ రెడీ అయ్యేనా?

- శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం అగ్నిప్రమాదంలో రూ.100 కోట్ల నష్టం
- నాలుగో యూనిట్‌ను మరమ్మతు చేసిన వాయిత్ కంపెనీ
- ప్రారంభమైన 19 రోజులకే మరోసారి మంటలు
- కంపెనీ లైసెన్స్‌ను బ్లాక్ లిస్టులో పెట్టిన జెన్‌కో యాజమాన్యం
- మరోసారి అదే కంపెనీకి పనుల అప్పగింత ● ఏప్రిల్ వరకు గడువు
- మరమ్మతు కోసం వారం కిందట యూనిట్‌ను పరిశీలించిన కంపెనీ
- అవసరమైన స్టేటర్ వైన్డింగ్ కండక్టర్స్ కోసం చైనాలో ఆర్డర్



షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలోని నాలుగో యూనిట్ (ఇన్‌సెట్లో)స్టేటర్ బార్స్

దోమలపెంట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ప్రాజెక్టు ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో అగ్ని ప్రమాదానికి గురైన నాలుగో యూనిట్ ప్రారంభమయ్యేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రమాదం తర్వాత మరమ్మతులు చేపట్టినా, కొద్ది రోజుల్లోనే మళ్లీ అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నది. దీంతో మళ్లీ మరమ్మతులు చేపడుతున్నారు. భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో ఆరు యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్‌లో 150 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్ ఉత్పాదన చేస్తూనే, రాత్రి వేళ బ్యాటరీలు మార్చుతుండగా 2020 ఆగస్టు 20న షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. నైట్ డ్యూటీలో ఉన్న ఐదుగురు ఇంజనీర్లు, ఇద్దరు ప్లాంట్ అసిస్టెంట్లు, మరో ఇద్దరు హైదరాబాద్‌కు చెందిన అమర్ రాజా బ్యాటరీ కంపెనీ ఉద్యోగులు విద్యుత్ కేంద్రాన్ని ఎలాగైనా రక్షించాలని చివరి వరకు పోరాడి ప్రాణాలు వదిలారు. ప్రమాదంలో 4వ యూనిట్ పూర్తిగా కాలిపోగా, మిగతా యూనిట్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. దీంతో దాదాపు రూ.100 కోట్ల నష్టం జరిగిందని, ఇద్దరు సీఈల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగిందని అప్పటి ప్రభుత్వానికి ఇంటలిజెన్స్ నివేదికలు అందాయి. బాధ్యులైన అధికారులుపై చర్యలు తీసుకుంటామని జెన్‌కో యాజమాన్యం

పనులు పూర్తి చేయాలని జెన్‌కో యాజమాన్యం ఒత్తిడి

ఏడాదిన్నర క్రితం కాలిపోయిన 4వ యూనిట్‌కు మరమ్మతు పూర్తి చేసి, అప్పగించాలని వాయిత్ కంపెనీతో అగ్రిమెంట్ ఉంది. ఈ విషయ షై జెన్‌కో యాజమాన్యం కంపెనీపై ఒత్తిడి చేయగా, తమకు అదనంగా నిధులు కేటాయిస్తే తప్ప పనులు చేయలేమని మెండికేయడంతో చేసేదేమీలేక అదనంగా రూ.1.30 కోట్లు ఇచ్చేందుకు జెన్‌కో యాజమాన్యం అంగీకరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వారం కిందట వాయిత్ కంపెనీ బృందం నాలుగో యూ నిట్‌లో మరమ్మతులు చేపట్టేందుకు పరిశీలించినట్లు తెలిసింది. అవసరమైన స్టేటర్ వైన్డింగ్ కండక్టర్స్ కోసం చైనాలో ఆర్డర్ ఇచ్చినట్లు సమాచారం. అవి రాగానే పనులు మొదలు పెట్టే అవకాశం ఉంది.

సుమారు రూ.వెయ్యి కోట్ల నష్టం

విద్యుత్ కేంద్రంలో 2020లో జరిగిన భారీ అగ్ని ప్రమాదం వల్ల నాలుగో యూనిట్ పూర్తిగా కాలిపోయి, నాలుగేళ్లుగా విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో ప్రభుత్వానికి భారీగానే ఆర్థిక నష్టం జరిగినట్లు ఇంజనీర్లు అభిప్రాయపడుతున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే ప్రతీ ఏడాది వానాకాలంలో 120 రోజులు విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తారు. ఒక్క యూనిట్ 24 గంటలు విద్యుత్ ఉత్పాదన కొనసాగిస్తే రోజుకు సుమారు 36 లక్షల యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తారు. నాలుగు సంవత్సరాలుగా విద్యుత్ ఉత్పత్తి చేయకపోవడంతో 172 కోట్లా 80 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. ప్రభుత్వం ప్రైవేట్ రంగ విద్యుత్ సంస్థలతో విద్యుత్ కొనుగోలు చేసేందుకు యూనిట్‌కు రూ.5 వరకు చెల్లిస్తుంది. ఈవిధంగా లెక్కిస్తే సూమారు రూ.864 కోట్ల నష్టం వాటిల్లినట్లు చెప్పుకోవచ్చు, నాలుగో యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తి జరిగి ఉంటే ప్రభుత్వ పరంగా పేదలకు ఉచితంగా ఇస్తున్న విద్యుత్ పథకానికి ఇబ్బంది ఉండేది కాదని ఇంజనీరింగ్ నిపుణులు పేర్కొంటున్నారు.

వెల్లడించింది. కానీ, ఇప్పటి వరకు ఆ ఊసేలేదు. ఏడాది క్రితం అధికారం చేపట్టిన కొత్తలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. కానీ ఎటువంటి ప్రయోజనం లేకపోయింది.

బ్లాక్ లిస్టులో పెట్టిన కంపెనీకి మరోసారి పనులు

అగ్ని ప్రమాదంలో కాలిపోయిన నాలుగో యూనిట్ మరమ్మతు పనులు చేపట్టేందుకు ఢిల్లీకి చెందిన వాయిత్ కంపెనీ రూ.14,93,41,271లకు టెండరు దక్కించుకున్నది. 2021 సెప్టెంబరులో పనులు ప్రారంభించి, 2023 జూలై చివరి నాటికి పూర్తి చేసి,

(మిగతా 6లో..)

ఒత్తిడికి గురికావొద్దు: కలెక్టర్



ఏఐ శిక్షణను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి(ఫైల్)

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని, అప్పుడే మంచి ఫలితం వస్తుందని కలెక్టర్ విజయేందర బోయి అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ లైన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏఐ శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు ఇస్తున్న ఏఐ శిక్షణను పరిశీలించారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. నాలుగు రోజుల్లో పరీక్షలు ప్రారంభం కానున్నాయని, ఎలా చదివారని అడిగారు. ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని, భయం వద్దని సూచించారు. ఫస్ట్ క్లాస్ వచ్చినా, పాస్ అయినా పాజిటివ్‌గా తీసుకోవాలన్నారు. పరీక్షలు పూర్తయిన తరువాత సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని, మంచి పుస్తకాలు చదవాలని సూచించారు. పదో తరగతి పూర్తయిన తర్వాత ఏం చేద్దామనుకుంటారు? అని బాలికలను ప్రశ్నించారు. కొందరు ఎంపీసీ, మరి కొందరు బైపీసీ తీసుకుంటామని చెప్పారు. బాలురు ఏం చెప్పడం లేదు? ఎందుకు? అని అడుగగా కొందరు మాత్రం ఇంటర్‌లో ఎంపీసీ తీసుకుంటామని సమాధానం ఇచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ.. బాలికలు చురుకుగా సమాధానం ఇస్తుంటే బాలురు మాత్రం డల్‌గా ఉన్నారు.. వీరికి కెరియర్ గైడెన్స్ ఇవ్వలేదా? అని అక్కడే ఉన్న డీఈవో, ప్రధానోపాధ్యాయులను అడిగారు. ఇప్పించాం మేడం అని వారు చెప్పారు. విద్యార్థులకు కలెక్టర్ ఆల్ ది బెస్ట్ చెప్పారు. డీఈవో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు బైకాని బాలు యాదవ్, దుంకుడు శ్రీనివాస్‌లు, ఎంఈవో లక్ష్మణ్ సింగ్, ప్రధానోపాధ్యాయులు జయశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సాగులో ఉన్న వరి చేను

రైతు భరోసా 95 శాతం జమ

- మహబూబ్‌నగర్ జిల్లాలో 2.39 లక్షల మంది రైతులు
- ఇప్పటి వరకు 2.04 లక్షల మంది ఖాతాల్లోకి రూ.194.38 కోట్లు ట్రాన్స్‌ఫర్
- 34,710 మందికి పెండింగ్

పాలమూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలో రైతు భరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం 95 శాతం మందికి అందించినట్లు అధికారులు చెబుతున్నారు. పథకం అమలును రాష్ట్ర ప్రభుత్వం ఏడాది కిందట ప్రారంభించింది. ఈ ఏడాది యాసంగికి సంబంధించి 2,04,413 మంది రైతుల ఖాతాల్లో రూ.194.38 కోట్లు జమ అయ్యాయి. ఇంకా 34,710 మందికి రైతు భరోసా అందాల్సి ఉంది. రోజూ కొంత మంది రైతుల ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు జమ చేస్తోంది. జిల్లాలో చిన్న, సన్నకారు రైతులందరికీ రైతు భరోసా అందించినట్లు అధికారులు చెబుతున్నారు. మార్చి చివరి నాటికి పూర్తిగా రైతులందరి ఖాతాల్లో డబ్బు జమ అవుతుందని అంటున్నారు.

మొదట ఎకరం భూమి ఉన్నరైతులకు..

గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధును కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా కింద మార్చి అమలు చేస్తోంది. ఎకరాకు రూ.ఆరు వేల చొప్పున అందిస్తోంది. జిల్లాలో మొదట ఎకరంలోపు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. ఎకరం పూర్తయిన తర్వాత రెండెకరాలు.. ఇలా ఒక్కో ఎకరం పెంచుకుంటూ డబ్బులను జమ చేస్తున్నారు. జిల్లాలోని 2,04,413 మంది రైతుల ఖాతాల్లో రూ.194 కోట్లా 38 లక్షలా 33,331 రైతుల ఖాతాల్లో జమచేసినట్లు అధికారులు చెబుతున్నారు.



వరి చేనుకు ఎరువు చల్లుతున్న రైతు(ఫైల్)

పాత విధానంలోనే..

2023 డిసెంబరులో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పాత విధానంలోనే రైతు భరోసా నిధులను అందిస్తోంది. ఎకరాకు రూ.15 వేల చొప్పున ప్రకటించగా, రూ.12 వేలు ఇస్తోంది. మార్చి 16వ తేదీ నాటికి జిల్లాలో 2,39,123 మంది రైతులను రైతు భరోసాకు అర్హులుగా గుర్తించారు. యాసంగి సీజన్‌కు రూ.231.07 కోట్లు కేయించగా, నేటికి 2,04,413 మంది రైతుల ఖాతాల్లో రూ.194.38 కోట్లు జమ చేశారు. మరో 34,710 మంది రైతులకు రైతుభరోసా పడాల్సి ఉంది. గత ఏడాది యాసంగిలో 2 లక్షలా 18 వేల మంది రైతులకు రూ.233 కోట్ల నిధులు రైతుభరోసా కింద రైతులకు అంద జే సి న ట్లు అధికారులు వివరించారు.

అర్హులందరి ఖాతాల్లో జమ



అర్హులైన రైతులందరి ఖాతాల్లో ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు జమ చేస్తోంది. చిన్న, ముందుగా చిన్న, సన్నకారు రైతులకు, తర్వాత మిగిలిన వారికి డబ్బులను జమ చేస్తోంది. రైతులు భయపడాల్సిన అవసరంలేదు. అర్హులైన వారందరికీ పెట్టుబడి సాయం అందుతుంది.

- బి.వెంకటేష్, జిల్లా వ్యవసాయాధికారి

7



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

ఫిర్యాదులను పరిష్కరించాలి

నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి 30 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లకు విన్నవిస్తూ, దరఖాస్తులు సమర్పించారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా, పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో లోకల్ బాడీ అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలం, ఆర్డీవో రాంచందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జనరల్ ఆసుపత్రిలో అత్యాధునిక శస్త్రచికిత్సలు

సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్

అక్రమాలపై నివేదిక సిద్ధం

- సెక్షన్ అధికారిపై తప్పని చర్యలు?
- జూలపల్లి అడవిలో జరిగిన అవకతవకలపై డీఎఫ్‌వోకు విచారణ నివేదిక

మహమ్మదాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మహమ్మదాబాద్ రేంజ్ పరిధిలోని జూలపల్లి, కొండాపూర్ అడవిల నుంచి సెక్షన్ అధికారి చేపట్టిన కలప అక్రమ రవాణా నేపథ్యంలో అతనిపై అధికారులు చర్యలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో 'అడవిని అమ్మేశారు', 'తవ్వినకొద్దీ అక్రమాలు', 'సెక్షన్ అధికారిపై వేటుకు రంగం సిద్ధం' అన్న శీర్షికలతో వరుస కథనాలు ప్రచురితం అయ్యాయి. దాంతో ఉమ్మడి జిల్లా అటవీ శాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. జూలపల్లి అటవీ ప్రాంతంలో నీలగిరి, ఇతర చెట్లను నరికిన ప్రాంతాలను జిల్లా అధికారులు, ఆమన్‌గల్ అటవీ రేంజ్ అధికారులు పరిశీలించారు. ఆమన్‌గల్‌లో పట్టుబడ్డ లారీని పరిశీలించిన అధికారులు, లారీ డ్రైవర్ తదితరుల వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. జూలపల్లి అడవిలో ఏడాదిన్నర నుంచి జరిగిన అక్రమాలపై పూర్తి వివరాలు సేకరించారు. అక్కడ కొన్నేళ్లుగా పని చేస్తున్న కూలీలు, కింది స్థాయి సిబ్బంది, చుట్టు పక్కల రైతులతో అడవిలో ఏం జరిగింది?, ఎక్కడెక్కడ చెట్లు నరికారు?, కూలీలకు ఎంతకాలం నుంచి కూలి ఇవ్వకుండా వేధించారు? అన్న అంశాలపై మూడు రోజుల పాటు విచారణ చేశారు. రూ.లక్షలు విలువ చేసే కలప రవాణా చేసినట్లు వారు చెప్పినట్లు తెలిసింది. నీలగిరి కలపను పెద్ద మొత్తంలో అమ్ముకున్నట్లు సమాచారం. అక్రమాలకు పాలుపడిన సెక్షన్ అధికారిని కూడా విచారించినట్లు తెలిసింది. ఆయన మాత్రం ఎలాంటి సమాచారం ఇవ్వలేదని సమాచారం. 'ఆంధ్రజ్యోతి' మహమ్మదాబాద్ ఫారెస్ట్ రేంజ్ అధికారి అబ్దుల్ హైని సోమవారం వివరణ కోరగా, జిల్లా అటవీ అధికారికి నివేదికను అందించినట్లు తెలిపారు.

అక్రమాలకు పాల్పడ్డట్లు తేలింది

జూలపల్లి అడవిలో కలప అక్రమ రవాణా విషయమై రేంజ్ అధికారి నుంచి విచారణ నివేదిక అందింది. సంబంధింత సెక్షన్ అధికారి అక్రమాలకు పాల్పడ్డట్లు తేలింది. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాలపై కూడా దృష్టి పెట్టాం. నివేదికను ఆయనకు పంపించాం.

- సత్యనారాయణ, మహబూబ్‌నగర్ డీఎఫ్‌వో

గురుకులం పిలుస్తోంది..

- మైనార్టీ గురుకులాల్లో మెరుగైన విద్య
- ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులు
- ఐదవ తరగతి, ఇంటర్‌లలో ప్రవేశాలు
- ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

7

వైభవంగా కల్యాణ వేడుకలు

- శ్రీమఠంలో సామూహిక వివాహాలు

7

స్పోర్ట్స్ బాక్స్

జాతీయ స్థాయి కబడ్డీ క్యాంపునకు గద్వాల జిల్లా క్రీడాకారుడు



కబడ్డీ క్రీడాకారులు బీచుపల్లి

గద్వాల అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జమ్ము కశ్మీర్‌లో ఈ నెల 27 నుంచి 30 వరకు నిర్వహించనున్న కబడ్డీ జాతీయ క్యాంపునకు జిల్లాకు చెందిన క్రీడాకారుడు బీచుపల్లి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ గతనెల 21 నుంచి 24 వరకు వికారాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో బీచుపల్లి ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయ క్యాంపునకు ఎంపికైనట్లు తెలిపారు. ఆయన ఈ నెల 18 నుంచి 24 వరకు కాసాని జ్ఞానేశ్వర్ రావు అకాడమీ, బాచుపల్లిలో జరిగే క్యాంపులోనూ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారుడు బీచుపల్లిని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డీకే స్నిగ్ధారెడ్డి, సెక్రటరీ నరసింహ, ట్రెజరర్ చందు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి, వెంకటేశ్వర్ రెడ్డి, బండల వెంకట్రాములు, రామాంజనేయులు, అబ్రహం, తరుణ, వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో సీఎన్‌ఆర్ విద్యార్థుల ప్రతిభ



ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన సీఎన్‌ఆర్ విద్యా సంస్థల విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం, ఉపాధ్యాయులు

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-14 ఫుట్‌బాల్ పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన సీఎన్‌ఆర్ విద్యా సంస్థల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పోటీల్లో పాల్గొని ఉత్తమ క్రీడాకారులుగా ప్రశంసా పత్రాలు పొందిన విద్యార్థులను సోమవారం సీఎన్‌ఆర్ విద్యా సంస్థల ఫౌండర్ సి.భాస్కర్‌రావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14, 15, 16 తేదీల్లో వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన టి.యక్షిత్(8వ తరగతి), పి.త్రిశులేశ్వర్(7వ తరగతి) పాల్గొన్న జట్టు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ, యాజమాన్యం నరసింహమూర్తి, ఫసియోద్దీన్, వెంకటేశ్వర్‌రావు, పీఈటీలు నరేష్, ఆనంద్, సత్యనారాయణ, గోపి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో మక్తల్ విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన బాలికలతో కోచ్ గోపాలం

మక్తల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లాకు చెందిన నలుగురు విద్యార్థినులు టెన్నికాయిట్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. హన్మకొండలో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో శ్రీలత 3వ స్థానం, స్వప్న 4వ స్థానం, గాయత్రి 5వ స్థానం, అఖిల 6వ స్థానంలో నిలిచినట్లు నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి, కోచ్ గోపాలం తెలిపారు. వారు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సద్గురు, ప్రధాన కార్యదర్శి పీ.ఎన్.వెంకటేశ్, వరంగల్ జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి 84 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను యువజన క్రీడా శాఖ జిల్లా అధికారి వెంకటేశ్‌శెట్టి, టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు దీప, చైర్మన్ సత్య అంజనేయులు అభినందించారు.

నెట్‌లో సత్తా చాటిన కొల్లాపూర్ విద్యార్థులు



సంధ్యశ్రీ




చంద్రకాంత



బిందూజ

కొల్లాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : యూనివర్సిటీ గ్రాండ్స్ కమిషన్ న్యూ ఢిల్లీ వారు నిర్వహించిన నేషనల్ ఎలిజిబులిటీ టెస్టు (నెట్) ఫలితాల్లో కొల్లాపూర్ పీజీ కేంద్రం విద్యార్థులు సత్తా చాటారు. తెలుగు శాఖ విద్యార్థులు బిందూజ, సంధ్యశ్రీ, చంద్రకాంత అర్హత సాధించారు. వారిని ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్‌పోలోనియస్ అభినందించారు. అదే విధంగా తెలుగు శాఖ అధ్యక్షుడు 3వ సెమిస్టర్‌లోనే యూజీసీ నెట్ అర్హత సాధించిన చంద్రకాంతను తెలుగు శాఖ అధ్యాపకులు, సహచర అధ్యాపకులు బోధ నేతర సిబ్బంది అభినందించారు.

ముదిరిన ఎండలు



- ఉదయం 11 దాటితే బయటకు రావడానికి జంకుతున్న జనం
- మధ్యాహ్నం 12గంటల తర్వాత నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు
- ఉమ్మడి జిల్లాలో పెరిగిన కరెంటు వినియోగం

నాగర్‌కర్నూల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మార్చిలోనే ఎండలు ముదిరాయి. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉండబోతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఫిబ్రవరి చివరి వారం నుంచి ఎండల తీవ్రత బాగా పెరుగుతూ వస్తోంది. మార్చి రెండో వారం ప్రారంభమైనప్పటి నుంచి పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతూ వస్తుండడం గమనార్హం. ప్రజలు ఉదయం 11గంటలు దాటితే బయటకు రావడానికి సంకోచిస్తున్నారు. ముదిరిన ఎండల కారణంగా ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాలల్లో కరెంటు వినియోగం క్రమంగా పెరుగుతూ వస్తోంది.

మార్చి రెండో వారం నుంచి భానుడి భగభగ

ఐదు జిల్లాల్లో కూడా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. ఫిబ్రవరి 27న మహబూబ్‌నగర్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రత 33డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రత 21డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాలల్లో 36-21, నారాయపేటలో 33డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత, 21డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఫిబ్రవరి 28న నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల్లో 33డిగ్రీల గరిష్ఠ, 22 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా మార్చి 16న పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మహబూబ్‌నగర్‌లో గరిష్ఠంగా 40డిగ్రీలు, కనిష్ఠంగా 22డిగ్రీలు నమోదు కాగా నాగర్‌కర్నూల్‌లో 40-23, వనపర్తిలో 41-24, గద్వాలలో 41-24డిగ్రీల గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడం విశేషం.



నాగర్‌కర్నూల్ టౌన్‌లో విద్యుత్ సబ్ స్టేషన్

పెరిగిన విద్యుత్ వినియోగం

ఎండలు ముదిరిన కారణంగా జిల్లాలో విద్యుత్ వినియోగం క్రమంగా పెరుగుతూ వస్తోంది. దీంతో కరెంటు సరఫరాకు బాగా డిమాండ్ ఏర్పడింది. బీమా, జూరాల, నెట్టెంపాడు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల కాల్వల కింద రైతులు అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేశారు. కాల్వల్లో పంపుసెట్లను వినియోగించి పంట పొలాలకు సాగునీటిని అందిస్తున్నారు. బోర్లు, బావుల కింద కూడా ఇతర పంటలను సాగు చేస్తుండడంతో వేసవిలో కరెంటు డిమాండ్ బాగా పెరిగింది. గద్వాల జిల్లాలో 54,375 వ్యవసాయ కనెక్షన్లు, ఒక లక్ష 27వేల 461 గృహ విద్యుత్ వినియోగదారులు, 17వేల 918 కమర్షియల్ కనెక్షన్లు ఉన్నారు. సాధారణ రోజుల్లో 36లక్షల 50వేల యూనిట్లు ఒక రోజు డిమాండ్ కాగా ప్రస్తుతం రోజుకు 43లక్షల 50వేల యూనిట్లకు చేరింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 78వేల 538 వ్యవసాయ, 2లక్షల 75వేల 996 గృహ, 41వేల 726 కమర్షియల్ కనెక్షన్లు ఉండగా జనవరి 18వరకు 334.3మిలియన్ యూనిట్ల డిమాండ్, మార్చి 16వరకు రోజుకు 447.85మిలియన్ యూనిట్లకు పెరిగింది. వనపర్తి జిల్లాలో కూడా ఒక లక్ష 25వేల 921 గృహ, 52వేల 466 వ్యవసాయ, 17వేల 085కమర్షియల్ కనెక్షన్లు ఉండగా జనవరిలో 3.47మిలియన్ యూనిట్లు ఉన్న డిమాండ్ మార్చి 16నాటికి 4.48కి పెరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు ఉండగా ఒక లక్ష 15వేల 958వ్యవసాయ, 3లక్షల 61వేల 275గృహ, 30వేల 073 కమర్షియల్ కనెక్షన్లు ఉండగా ఫిబ్రవరి నెలలో 286.3 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉండగా మార్చి మాసంలో ఇప్పటి వరకే 173.37 మిలియన్ యూనిట్లకు విద్యుత్ వినియోగం పెరిగింది. ప్రస్తుతం గృహ, వ్యవసాయ రంగాలకు కోతలు లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా జరుగుతున్నా మున్ముందు ఎండలు తీవ్రమైతే పరిస్థితి ఎలా ఉండబోతుందోననే ఆందోళన విద్యుత్ శాఖ అధికారుల్లో నెలకొంది.

చిరు వ్యాపారులకు సంకటం

ముదిరిన ఎండల నేపథ్యం చిరు వ్యాపారులను అవస్థలకు గురి చేస్తోంది. కూరగాయలు, పండ్లు, సంచార వ్యాపారం చేసుకునే వారు ఎండ వేడిని తాళలేకపోతున్నారు. రేకుల షెడ్లల్లో చిన్న డబ్బాలల్లో వ్యాపారం చేసుకుంటున్న వారి పరిస్థితి కూడా బాగా లేదు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఎండ బారిన పడి అనారోగ్యానికి గురవుతున్నారు.

ఎండలకు తాళలేకపోతున్నాం



నేను రోడ్డు పక్కన పండ్లు అమ్ముకొని జీవనం సాగిస్తున్నా. ఎండల తీవ్రత తాళలేక గొడుగు పెట్టుకుని పండ్లు అమ్ముకుంటున్నా. అమ్మకానికి తెచ్చిన పండ్లు ఒక్క రోజుకే వాడిపోతున్నాయి. ఎండలు ఇప్పుడే ఇలా ఉంటే ఉగాది తర్వాత ఇంకా ఎలా ఉంటాయోనని భయమేస్తోంది.

- తిరుపతమ్మ, చిరు వ్యాపారి, నాగర్‌కర్నూల్

ఇంట్లో ఉన్నా ఉక్కపోత..



ఎండల చాలా ఎక్కువగా ఉన్నాయి. మధ్యాహ్న సమయంలో ఇంట్లో ఉన్నా ఉక్కపోత భరించలేకపోతున్నాం. ఎండలకు పిల్లలను బయటికి రానీయడం లేదు. రోజు సీతల పానీయాలు సేవించి ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందుతున్నాం.

జయలలిత, గృహిణి, నాగర్‌కర్నూల్

నాలుగో యూనిట్ రెడీ అయ్యేనా?



నాలుగో యూనిట్‌ను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేల బృందం (ఫైల్)

(5వ పేజీ తరువాయి)

జెన్‌కోకు అప్పగించారు. 2023 జూలై 17న 4వ యూనిట్‌ను రన్ చేసి, గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. 19 రోజుల్లో 70 గంటల వ్యవధిలో 11.6029 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. 2023 ఆగస్టు 17న స్టేటార్ వైండింగ్ బార్స్‌లో షాట్‌సర్క్యూట్ కావడంతో మరోసారి మంటలు చెలరేగాయి. యూనిట్ కాలిపోయి, పని చేయడం లేదు. సదరు కాంట్రాక్టు సంస్థ జెన్‌కో సంస్థ సక్రమంగా రన్ చేయకపోవడంతోనే షాట్ సర్క్యూట్ అయ్యిందని తప్పించుకునే ప్రయత్నం చేసింది. జెన్ యాజమాన్యం నిపుణుల కమిటీతో విచారణ చేయించగా మరమ్మతు పనులలో నాసిరకం మెటీరియల్ వాడటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని నివేదిక ఇచ్చింది. దీంతో వాయిత్ కంపెనీ కాంట్రాక్టు లైసెన్స్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టినట్లు జెన్‌కో యాజమాన్యం ప్రకటించింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నాలుగో యూనిట్ మరమ్మతు పనులను పూర్తి చేసి, ఈ ఏడాది సీజన్ నాటికి సిద్ధం చేయాలని ఆదేశించింది. ఇదిలా ఉండగా బ్లాక్ లిస్టులో చేర్చిన వాయిత్ కంపెనీకే మరోసారి పనులు అప్పగించడంలో అంతర్యమేమిటని ఇంజనీర్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. యూనిట్ పనులను నాణ్యతగా చేయకపోతే మునుముందు మరో ప్రమాదం జరుగుతుందేమోనని భూగర్భ విద్యుత్ కేంద్రం జెన్‌కో ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మికులు ఆందోళనకు గురవుతున్నారు.

జనరల్ ఆసుపత్రిలో అత్యాధునిక శస్త్రచికిత్సలు

- సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ సింగ్

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అత్యాధునిక శస్త్రచికిత్సలు చేస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్ తెలిపారు. ఆసుపత్రిలోని తన చాంబర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోటకదిర గ్రామానికి చెందిన 45 ఏళ్ల లక్ష్మమ్మ తీవ్రమైన కడుపునొప్పితో ఆసుపత్రికి రాగా, అన్ని పరీక్షలు చేసి పెద్ద కణతి ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. వెంటనే సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సునీల్ నేతృత్వంలో శస్త్రచికిత్స చేసి కణతిని తొలగించినట్లు చెప్పారు. అదేవిధంగా కరీంనగర్ జిల్లాకు చెందిన 42 ఏళ్ల ఈశయ్య చెవిలో ఇన్‌ఫెక్షన్‌తో ఆసుపత్రిలో చేరారని తెలిపారు. అన్ని పరీక్షలు చేసి, చెవి వెనకభాగం నుంచి మెదడు వరకు ఆ ఇన్‌ఫెక్షన్ సోకిందని గుర్తించామన్నారు. ఈఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్ నేతృత్వంలో అత్యాధునిక పద్ధతిలో సబ్‌టోటల్ పెట్రోసెక్టమీ శస్త్రచికిత్స చేశామని వెల్లడించారు. ఈ శస్త్రచికిత్సలకు ప్రైవేటులో దాదాపు రూ. 10 లక్షల వరకు ఖర్చు అవుతుందని, కానీ తమ ఆసుపత్రిలో ఆరోగ్య పథకం కింద ఉచితంగా చేశామని చెప్పారు. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో జరిగే అన్ని ఆపరేషన్లను జిల్లా జనరల్ ఆసుపత్రిలోనే ఆరోగ్యశ్రీ పథకం కింద చేస్తున్నామని, ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. శస్త్రచికిత్సలు చేసిన బృందంలో సర్జరీ విభాగం వైద్యులు మాధవి, గాయత్రి, రహీమ్, జగన్, వంశి, సాయిచరణ్, విజేత, ఈఎన్‌టీ విభాగం వైద్యులు శ్రీకాంత్, వైష్ణవి, రమేష్, ఓటీ ఇన్‌చార్జి నర్సులు ఉన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- తనిఖీ చేసిన ఉన్నతాధికారులు



పరీక్ష కేంద్రాలకు వెళ్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/ నాగర్‌కర్నూల్ టౌన్/ గద్వాల సర్కిల్/ వనపర్తి రూరల్/ మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఇంటర్ మొదటి సంవత్సరం భౌతికశాస్త్రం, ఆర్థికశాస్త్రం పేపర్-1 పరీక్షలు నిర్వహించారు.

- మహబూబ్‌నగర్ జిల్లాలోని 36 పరీక్ష కేంద్రాల్లో 12,123 మంది విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా, 11,787 మంది హాజరయ్యారు. మరో 336 మంది హాజరు కాలేదు. జనరల్ విభాగంలో 9,952 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 9,707 మంది హాజరయ్యారు. 245 మంది గైర్హాజర య్యారు. ఒకేషనల్ విభాగంలో 2,171 మందికి గాను, 2,080 మంది హాజరు కాగా 91 మంది పరీక్ష రాయలేదు.
- నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 7,367 మంది విద్యార్థులకు గాను, 6,928 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 439 మంది పరీక్ష రాయలేదు. వారిలో జనరల్ విభాగంలో 5,640 మందికి గాను, 5,323 మంది పరీక్ష రాశారు. 317 మంది గైర్హాజరయ్యారు. 1,727 ఒకే షనల్ విద్యార్థులకు గాను, 1,605 మంది హాజరు కాగా, 122 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి వెంకటరమణ నాగర్ కర్నూల్ పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాల, శ్రీనివాస పద్మావతి జూనియర్ కళాశాల, మైనార్టీ జూనియర్ కళాశాల, మహాత్మా జ్యోతిబా పూలే బాలికల జూనియర్ కళాశాల లను తనిఖీ చేశారు.
- జోగుళాంబ గద్వాల జిల్లాలోని 14 పరీక్షా కేంద్రాల్లో 95 శాతం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 4,533 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 4,326 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో జనరల్ 3,641 మందికి గాను, 3,493 (96 శాతం), వృత్తి విద్య 892 మందికి, 833 (93.2 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారు. మల్దకల్, అయిజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, అరోరా, శ్రీహరిహర జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను డీఐఈవో హృదయరాజు తనిఖీ చేశారు. సాయుధ దళ డీఎస్పీ నరేందర్‌రావు పర్యవేక్షణలో, గద్వాల సీఐ టంగుటూరి శ్రీను పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును పరిశీలించారు.
- వనపర్తి జిల్లాలో మొత్తం 7,245 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 6,949 (95.91 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారు. 296 మంది పరీక్ష రాయలేదు. జనరల్ విభాగంలో 6,053 మంది హాజరు కావాల్సి ఉండగా, 5,837 మంది హాజరయ్యారు. 216 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,192 మంది విద్యార్థులకు గాను, 1,112 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 80 మంది విద్యార్థులు పరీక్ష రాయలేదు. సూర్య ఒకేషనల్, జూనియర్ కళాశాల, వాగ్దేవి జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను డీఐఈవో అంజయ్య తనిఖీ చేశారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీరామ్ ఆర్య

తెలకపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నాగర్‌కర్నూల్ చైర్మన్ సెక్రటరీ ఆదేశాల మేరకు చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్స్ స్కీం గురించి అవగాహన కల్పించడానికి సోమవారం లీగల్ సర్వీసెస్ యూనిట్ ఫర్ చిల్డ్రన్ నాగర్‌కర్నూల్ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్‌లో తెలకపల్లిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏసీపీ శ్రీరామ్ ఆర్య డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ హాజరై మాట్లాడుతూ బాలబాలికలందరూ తప్పనిసరిగా పాఠశాలకు వచ్చి చదువుకోవాల న్నారు. బాలబాలికలందరూ ఫోన్ వాడకంలో అప్రమత్తంగా ఉండాలని ఫోన్‌లో వచ్చిన మెసేజ్‌లను గాని వీడియోలను గాని ప్రతి దానిని ఇతరులకు ఫార్వర్డ్ చేయడం గాని వాటికి తిరిగి రిప్లై ఇవ్వడం గాని చేయరాదన్నారు. ఉచిత న్యాయ సహాయం కోసం 15100 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి లబ్ధి పొందాలని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు, పారా లీగల్ వాలంటీర్లు జి.బాలస్వామి, సి.అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్ల కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఆవరణంలో అంగన్‌వాడీల 48 గంటల సమ్మె శిబిరాన్ని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సమ్మెనుద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే అంగన్‌వాడీల వేతనాలు పెంచి వారి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల పాలన పూర్తయినా ఎలాంటి స్పందన లేదని పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానంలో మొబైల్ సెంటర్ల పేరుతో అంగన్‌వాడీలను నిర్వీర్యం చేసే కుట్ర పన్నుతోందని ఆరోపించారు. దీనివల్ల మాత శిశు మరణాలు, బాలింతల మరణాల రేటు పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో అంగన్‌వాడీల వేతనాలు పెంచేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఆయన కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు చంద్రకళ, ప్రభావతి, రజియా, సుచిత్ర, జయమ్మ, అంజనమ్మ, రంజాన్‌బీ, సుగుణ, అలివేల, వెంకటమ్మ, భాగ్యమ్మ, విజయలక్ష్మీ, యాదమ్మ, కృష్ణవేణి, అనిత తదితరులు పాల్గొన్నారు.

అంతుచిక్కని ఆచూకీ



క్యాడవర్ డాగ్స్ గుర్తించిన ప్రాంతాలలో తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

- రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించి 24 రోజులు గడుస్తున్నా దొరకని గల్లంతైనవారు
- టన్నెల్ లోపల వినియోగంలోకి రాని రోబోటిక్ మిషనరీలు

నాగర్‌కర్నూల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎల్‌బీసీలో ప్రమాదం జరిగి 24 రోజులు గడిచాయి. టన్నెల్‌లో ఎదురవుతున్న ప్రతికూల పరిస్థితుల వల్ల సహాయక చర్యలు అనుకున్నంత స్థాయిలో ముందుకు కదలడం లేదు. 18 ఏజెన్సీలు, 703 మంది రెస్క్యూ సిబ్బంది, మూడు షిఫ్టుల్లో సొరంగంలో మట్టి అడుగు భాగంలో ఉన్న మృతదేహాలను వెలికి తెచ్చే ప్రయత్నం చేస్తున్నా సాధ్యపడటం లేదు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణి కార్మికులను ప్రమాదం జరిగిన మరుసటి రోజు నుంచే రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దించింది. ప్రమాదం జరిగిన చోట ముందుకు వెళ్లలేని పరిస్థితిని సహాయక బృందాలతో పాటు ర్యాట్‌హోల్ మైనర్లు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ కార్మికుల జాడను కనుగొనేందుకు రోబోటిక్ టెక్నాలజీ వినియోగానికి ప్రభుత్వం నాలుగు కోట్లు మంజూరు చేయగా దీని కంటే ముందే రాబిన్స్ కంపెనీకి చెందిన టన్నెల్ బోరింగ్ మిషన్ ఆపరేటర్ గురుప్రీత్‌సింగ్ మృతదేహం లభ్యం కావడంతో అందరిలో మిగతా వారి ఆచూకీపై ఆశలు చిగురించాయి. అయితే సొరంగం లోపల వాస్తవ పరిస్థితులు బయట అనుకుంటున్న విధంగా లేవు. టన్నెల్‌లో ఇప్పటికీ 300 నుంచి 400 మీటర్ల వరకు మట్టి, రాళ్లు పేరుకుపోయి ఉన్నాయి. యుద్ధ ప్రాతిపదికన శిథిలాలను తొలగించేందుకు లోపల వ్యవస్థను అమర్చుకోవడానికి ఇప్పటి వరకు రెస్క్యూ బృందాలకు అవకాశం దొరకడం లేదు. శిథిలాల తొలగింపు ప్రక్రియకు రోబోటిక్ మిషనరీ సహకరిస్తుందని భావించిన వాళ్లకి ఈ మిషనరీ పని చేయడానికి సిగ్నల్స్ వ్యవస్థ సమస్యగా మారింది. మొరాయిస్తున్న కన్వేయర్ బెల్టు కారణంగా మట్టి దిబ్బలను వేగంగా బయటకు తీసుకొచ్చే పరిస్థితి లేదు. ప్లాస్మా కట్టింగ్ ద్వారా తొలగించిన టన్నెల్ బోరింగ్ మిషన్ శిథిలాలను లోకో ట్రైన్ ద్వారా బయటకు తీసుకురావడానికి అత్యధిక సమయం పడుతుంది. యుద్ధప్రాతిపదికన మట్టి, రాళ్ల కుప్పలను సొరంగం నుంచి బయటకు తీసుకొస్తే తప్పా గల్లంతైన వారి ఆచూకీ కనుగొనే పరిస్థితే ఉండదని క్యాడవర్ శునకాలను సోమవారం టన్నెల్‌లోకి తీసుకెళ్లిన పోలీసులు తెలిపారు. టన్నెల్ లోని పరిస్థితిని నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. మట్టి తరలింపు ప్రక్రియ ఆలస్యమవుతుండటంతో బాధిత కుటుంబాల్లో తమ సంబంధీకులు జీవించి ఉన్నారా లేదా అనే అంశంపై ఆశలు పూర్తిగా సన్నగిల్లాయి.

క్రైం కార్నర్

దేవుని తిర్మలాపురం వద్ద రోడ్డు ప్రమాదం

» కాంగ్రెస్ మండల నాయకుడి భార్య మృతి



మెరుగు అనూష (ఫైల్)

పెద్దకొత్తపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండల పరిధిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ మండల నాయకుడి భార్య మృతి చెందింది. స్థానిక నాయకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దకొత్తపల్లి సింగిల్ విండో వైస్ చైర్మన్, మండలంలోని పెద్దకార్పాముల గ్రామానికి చెందిన మెరుగు రాజు యాదవ్ ఆదివారం భార్య అనూష (23), మూడేళ్ల కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంపై వనపర్తికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మండల పరిధిలోని దేవుని తిర్మలాపూర్ సమీపంలో మామిడి తోట వద్ద పెద్దకొత్తపల్లి వైపు నుంచి వేగంగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి కింద పడ్డారు. ప్రమాదంలో అనూష తలకు బలమైన గాయమైంది. భర్త మెరుగు రాజు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, ఆమెను నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా, మార్గంమధ్యలో మృతి చెందింది. సంఘటనపై అనూష తండ్రి దండె ఆనందం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వి.సతీశ్ తెలిపారు. ప్రమాదంలో రాజు యాదవ్‌తో పాటు కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల నాయకులు జూపల్లి అరుణ్ కుమార్, దండు నరసింహ, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, చంద్రయ్యయాదవ్ తదితరులు సోమవారం గ్రామానికి వెళ్లి రాజును పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. సాయంత్రం జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ధరూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలు భరించలేక ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూరు మండల పరిధిలోని మన్నాపూర్ గ్రామానికి చెందిన అబ్రహం (21) అనే యువకుడు కుటుంబకలహాలు భరించలేక ఈ నెల 15న పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ధరూర్ పోలీసులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. మృతుడి తండ్రి రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

కాడెద్దుల అపహరణ

ఎర్రవల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండల పరిధిలోని సాసనూలు గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు రెండు కాడెద్దులను అపహరించారు. గ్రామానికి చెందిన రైతులు బోయ మద్దిలేటి, లక్ష్మీనాయుడులు ఆదివారం రాత్రి 9:30 గంటల సమయంలో ఇంటి ముందు కట్టేసిన ఎద్దులకు మేత వేసి వెళ్లి పడుకున్నారు. సోమవారం తెల్లవారుజామున వెళ్లిచూడగా మద్దిలేటికి చెందిన ఒక ఎద్దు, లక్ష్మీనాయుడుకు చెందిన ఒక ఎద్దు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు తమ ఎద్దులను అపహరించుకు వెళ్లారని బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక్కో ఎద్దు విలువ రూ.70 వేలకు పైగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ మురళి తెలిపారు.

వాహనం ఢీకొని 10 గొర్రెల మృతి

అచ్చంపేట టౌన్, మార్చి 17 : (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని 10 గొర్రెలు చనిపోయాయి. ఈ సంఘటన సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండల పరిధిలోని శ్రీశైలం - హైదరాబాద్ ప్రధాన రహదారిపై, చెన్నారం స్టేజీ సమీపంలో జరిగింది. బాధితుడు వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అమ్రాబాద్ మండల పరిధిలోని మాధవానిపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్ సోమవారం ఉదయం గొర్రెల మందను మేపేందుకు తీసుకెళ్తుండగా, గుర్తు తెలియని వాహనం వాటి మీదుగా దూసుకెళ్లింది. దీంతో 10 గొర్రెలు అక్కడికక్కడే చనిపోయాయి. మరో 10 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేశ్ తెలిపారు. మృతి చెందిన గొర్రెల విలువ లక్ష రూపాయలకు పైగా ఉంటుందని చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఊట్కూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా, ధన్వాడ మండల కేంద్రానికి చెందిన కంటె బాలరాజు ఊట్కూరు మండలంలోని కొత్తపల్లి గ్రామంలో లబ్ధిదారుల నుంచి రూ.10కి కిలో చొప్పున ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించాడు. ఆ బియ్యాన్ని వాహనంలో తరలిస్తుండగా మార్గంమధ్యలో సివిల్ సప్లయి డీటీ కాళప్ప, ఎస్‌ఐ కృష్ణంరాజు దాడి చేసి పట్టుకున్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అత్తా మామలపై అల్లుడి దాడి

ఖిల్లాఘణపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : అత్తా మామలపై అల్లుడు దాడి చేసి గాయపరిచాడు. వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని వెనికితండాలో జరిగిన ఈ సంఘటనపై హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన భార్యా భర్తలు కేతావత్ శ్రీను, కేతావత్ లావణ్యల మధ్య ఇటీవల గొడవ జరిగింది. దీంతో లావణ్య అదే గ్రామంలో ఉండే తల్లిగారి ఇంటికి వెళ్లింది. ఈ నెల 16న రాత్రి కేతావత్ శ్రీను అత్తగారింటికి వచ్చాడు. భార్య లావణ్యను దూషిస్తూ దాడి చేశాడు. అతడిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన అత్త లక్ష్మి, మామ లాలులపై కూడా కర్రతో దాడి చేయడంతో వారిద్దరికీ గాయాలయ్యాయి. దీంతో కేతావత్ శ్రీనుపై భార్య లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారిపై కేసు

పెబ్బేరు రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పెబ్బేరు పట్టణంలో అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేసి, ప్లాట్లు విక్రయించిన వ్యాపారిపై పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెబ్బేరుకు చెందిన నరసింహారెడ్డికి 455 సర్వే నెంబర్‌లో 2.09 గుంటల భూమి ఉంది. ఆ భూమిని ఎల్లస్వామి అనే వ్యక్తి ఆక్రమించుకున్నాడు. అనుమతులు లేకుండా ప్లాట్లు చేసి విక్రయించాడు. ఈ విషయంపై బాధితుడు నరసింహారెడ్డి ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అగ్నిప్రమాదంలో పశుగ్రాసం దగ్ధం

అయిజ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదంలో పశుగ్రాసం దగ్ధమైంది. జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మునిసిపాలిటీ పరిధిలో సోమవారం మధ్యాహ్నం ఈ సంఘటన జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం తుపత్రాల గ్రామానికి చెందిన కురువ బాలప్ప తన దొడ్లో మూడు ట్రాక్టర్ల వరిగడ్డి, మూడు ట్రాక్టర్ల వేరుశెనగ పొట్టును నిల్వ ఉంచుకున్నారు. అదే గ్రామానికి చెందిన వడ్డె తిమ్మప్ప తన పొలంలో స్థలం లేక బాలప్ప దొడ్లోనే నిల్వ చేశాడు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో గడ్డివామికి మంటలు అంటుకున్నాయి. స్థానికులు గమనించి రైతులకు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. గద్వాల నుంచి ఫైర్ ఇంజన్ వచ్చే లోపు 80 శాతం గడ్డి కాలిపోయింది. దీంతో దాదాపు రూ. 2 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

గురుకులం పిలుస్తోంది..



గురుకుల పాఠశాలలో విద్యార్థులు (ఫైల్)

» మైనార్టీ గురుకులాల్లో మెరుగైన విద్య
» ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులు
» ఐదవ తరగతి, ఇంటర్‌లలో ప్రవేశాలు
» ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రభుత్వ మైనారిటీ గురుకుల పాఠశాలల్లో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా మెరుగైన విద్యాబోధన లభిస్తోంది. మైనార్టీ విద్యార్థుల కోసం గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 200కు పైగా మైనారిటీ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసింది. వాటిలో 121 పాఠశాలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసింది. అందులో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 20 గురుకులాల పాఠశాలలు ఉండగా, ఇందులో 10 బాలురు, 10 బాలికల పాఠశాలలు ఉన్నాయి. వాటిని జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. ఆ పాఠశాలలు, కళాశాలల్లో చదువు కుంటున్న విద్యార్థులు చక్కటి ప్రతిభ చాటి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. తాజాగా 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదవ తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రవేశానికి అరులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీలతో పాటు వృత్తి విద్యాకోర్సులు ఎంఎల్‌టీ, ఈటీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆయా పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశానికి విద్యార్థులు ఈ నెల 31లోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. పాఠశాలల్లో కూడా నేరుగా కూడా దరఖాస్తులను స్వీకరిస్తారు. మేలో డిప్ నిర్వహించి విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందిస్తారు.

అర్హులు వీరే....

మే నెలలో నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు అర్హులు. పదవ తరగతిలో 6 జీపీఏకు పైగా ఉత్తీర్ణత సాధించాలి. 18 ఏళ్లలోపు వయస్సు ఉండాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1.5 లక్షలు. పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షలు మించరాదు. ప్రస్తుతం నాలుగవ తరగతి చదివిన విద్యా ర్థులు ఐదవ తరగతికి దరఖాస్తు చేసుకోవచ్చు.

రిజర్వేషన్ల విధానం

ప్రతీ కళాశాలలో రెగ్యులర్, ఒకేషనల్ విభాగాల్లో, ఒక్కో గ్రూపుకు ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 40 చొప్పన 80 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతీ కోర్సులో మైనారిటీలకు 30, ఇతరులకు 10 సీట్లు కేటాయిస్తారు. మైనారిటీల్లో ముస్లింలకు 64, క్రైస్తవులకు 7, జైన్, పార్సీ, బుదిస్ట్, సిక్కులకు కలిపి 4 శాతం వంతున 75 శాతం సీట్లు కేటాయిస్తారు. ఎస్సీలకు 6, ఎస్టీలకు 4, బీసీలకు 12 శాతం చొప్పన 25 శాతం సీట్లను భర్తీ చేస్తారు. పాఠశాలల్లోనూ ఇదే విధానం ప్రకారం విద్యార్థులను చేర్చుకుంటారు.



గురుకుల పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

దరఖాస్తు ఉచితం



మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. తల్లిదండ్రులు పాఠశాలలు, కళాశాలల్లో సంప్రదించి, ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రవేశాలు కల్పిస్తాం. ఇంటర్మీడియట్, ఐదో తరగతి ప్రవేశాలకు ఈ నెల 31 వరకు దరఖాస్తులను స్వీకరిస్తాం. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అన్ని వసతులు కల్పిస్తాం.

- ఖాజాబహొద్దీన్, జిల్లా రీజనల్ లెవల్ కో ఆర్డినేటర్(ఆర్ఎల్‌సీ)

ఆర్టీసీ డిపోలను 'ప్రైవేట్'కు అప్పగిస్తున్నారా?

అసెంబ్లీలో ఎమ్మెల్యే జనుంపల్లి అనురుధ్‌రెడ్డి

జడ్చర్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు (జీసీసీ) పద్ధతిలో ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సమకూర్చుకుంటోందని, ఆర్టీసీ డిపోలను ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తున్నారా అని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి శాసనసభలో ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు మంగళవారం సమాధానం రానున్నదని సోమవారం జడ్చర్లలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు డీజిల్ భారం తగ్గించుకోవడానికి ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సులను సమకూర్చుకుంటోందని పేర్కొన్నారు. ఈ బస్సులకు డ్రైవర్‌లు, మెకానిక్‌లను ప్రైవేట్ సంస్థ సమకూర్చుకుంటోందని, కేవలం కండక్టర్లు మాత్రమే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడనుందని తెలిపారు. దీంతో ఆర్టీసీలో పని చేస్తున్న వేలాది మంది డ్రైవర్లు, మెకానిక్‌లు, పర్యవేక్షించే అధికారుల అవసరం లేకుండా పోతోందంటూ కార్మిక సంఘాల నాయకులు తన దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఈ అంశంపై తాను అసెంబ్లీలో ప్రశ్న లేవనెత్తానని, అది మంగళవారం చర్చకు రానున్నదని తెలిపారు. అలాగే టీ-ప్రైడ్ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ యువతకు, దివ్యాంగులకు వాహనాల కొనుగోలు కోసం ఇవ్వాల్సిన 45 శాతం సబ్సిడీని ఏళ్ల తరబడి ఇవ్వడంలేదని ప్రశ్నించానని, దానికి లిఖితపూర్వక సమాధానం వస్తుందని పేర్కొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఎన్నికకు నామినేషన్ల స్వీకరణ

కందనూలు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడి ఎన్నికకు పార్టీ జిల్లా కార్యాలయంలో రిటర్నింగ్ సహాయ అధికారులు బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మొగిలి దుర్గాప్రసాద్‌ల ఆధ్వర్యంలో సోమవారం నామినేషన్లు స్వీకరించినట్లు ఎన్నికల అధికారి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. దొడ్ల రాజవర్ధన్‌రెడ్డి, వేముల నరేందర్‌రావు, రాఘు వేందర్‌గౌడ్, పోల్‌దాసు రాము, బల్మూరు జానకి తదితరులు నామినేషన్లను సమర్పించారని తెలిపారు. అలాగే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా మొగిలి దుర్గాప్రసాద్, మాయని శ్రీశైలం, మొక్తాల రేణయ్య, సందు రమేశ్‌లు ఎంపికయ్యారని మాదగోని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

ముగిసిన వట్టెం వెంకన్న బ్రహ్మోత్సవాలు



వట్టెం వెంకన్న ఆలయ కోనేరులో చక్రతీర్థం నిర్వహిస్తున్న అర్చకులు, వేద పండితులు

బిజినేపల్లి, మార్చి (ఆంధ్రజ్యోతి) 17 : నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలంలోని వట్టెం వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ అనంత నరసింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మహాపూర్ణాహుతి, శ్రీపుష్పయాగం తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం యజ్ఞ ఆచార్యులు శ్రీమద్వాదుల శ్రీమన్నారాయణ, శ్రీకర్, శేషశాయి, రంగనాథ్ ప్రసాద్, నరసింహాచార్యులు, నవీన్, తివారీ తదితర అర్చక బృందం మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. ఆ తర్వాత ఆలయ ప్రాంగణంలోని కోనేరులో ఉత్సవ విగ్రహాలు, శంఖు, చక్రాలకు శాస్త్రోక్తంగా స్నానం చేయించారు. దీంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు సందడి ప్రతాప్ రెడ్డి, సందడి నరేందర్ రెడ్డి, సందడి రామచంద్రారెడ్డి, కొర్ర చంద్రారెడ్డి, బండారు రాజశేఖర్, భాస్క రాచారి, విట్టల్, వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ వేడుకలు

- శ్రీమఠంలో సామూహిక వివాహాలు



వివాహ వేడుకను జరిపిస్తున్న స్వాములు, పురోహితులు

మాగనూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మాగనూరు మండలంలోని పశ్చిమాద్రి విరక్తి సంస్థాన మఠంలో సోమవారం సామూహిక కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. మూడవ సిద్ధలింగ మహాస్వామి 60వ పుణ్యతిథిని పురస్కరించుకొని పీఠాధిపతి పంచమసిద్ధ లింగ మహాస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిరుపేద కుటుంబాలకు చెందిన 14 జంటలకు వివాహం జరిపించారు. వధూవరులకు పట్టువస్త్రాలు, తాళిబొట్టు, మెట్టెలు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా పంచమ సిద్ధ లింగ మహాస్వామి మాట్లాడుతూ మఠం ఆధ్వర్యంలో అనాథాశ్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు లేని, తండ్రి ఉండి, తల్లి లేని చిన్నారులను ఆశ్రమంలో చేర్చుకొని, చదువుతో పాటు, సాంస్కృతిక అంశాలు, కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఎక్కడైనా అనాథలైన చిన్నారులు ఉంటే ఆశ్రమంలో చేర్పించాలని భక్తులను, ప్రజలను కోరారు. మఠంలో గోశాలను కూడా ఏర్పాటు చేశామని, రైతులు గోవులను వధశాలకు విక్రయించొద్దని, గోశాలలో వదలాలని కోరారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వివిధ మఠాల పీఠాధిపతులు, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచు అశోక్‌గౌడ్, ఆర్.విద్యాసాగర్, మంజుల, రాఘవేంద్ర, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎల్లారెడ్డి, వాకిటి మల్లేశ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొంకూరు వారి బీరప్ప పండుగ



బీరప్ప దేవాలయం ముందు పసుపు బండారు చల్లుకుంటున్న బొంకూరు కులస్తులు, భక్తులు


తాడూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాపగల్ గ్రామంలో మూడు రోజులుగా బొంకూరు వారి బీరప్ప పండుగలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. సోమవారం గ్రామంలో గల బీరప్ప దేవాలయ ప్రాంగణంలో బొంకూరు వారి కులస్తులందరూ పసుపుతో కూడిన బండారును వేసుకున్నారు. ఇలా బండారు వేసుకోవడం ద్వారా వారందరికీ మంచి జరుగుతుందని విశ్వసిస్తారు. ఈ కార్యక్రమానికి పరిసర గ్రామాలకు చెందిన కురువ కులస్తులతోపాటు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రమేష్, నారాయణ, లింగంతో పాటు మరికొంత మంది పాల్గొన్నారు.

జలాధివాసం నుంచి బయటపడుతున్న సంగమేశ్వరాలయం



కృష్ణానదిలో జలాధివాసం నుంచి బయటపడుతున్న సంగమేశ్వరాలయం

కొల్లాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాల ప్రజల ఆరాధ్య దైవంగా పూజించే సప్త నదుల సంగమ క్షేత్రం, నాగర్‌కర్నూలు జిల్లా సరిహద్దు, ఏపీలోని ముచ్చుమర్రి సమీపంలో ఉండే సంగమేశ్వరాలయం కృష్ణానది జలాధివాసం నుంచి బయటపడుతోంది. కృష్ణానదిలో రోజురోజుకు తగ్గుతున్న నీటిమట్టం వల్ల సప్త నదుల సంగమక్షేత్రం సంగమేశ్వరాలయంలోని గర్భాలయం జలాధివాసం నుంచి బయటపడుతుండటంతో ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామయ్య శర్మ సోమవారం పూజలు నిర్వహించారు. శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ఇంకా తగ్గుముఖం పడితే మరో వారం రోజుల్లో సంగమేశ్వరాలయం పూర్తిగా బయటపడనుందని పురోహితులు తెలకపల్లి రఘురామయ్య శర్మ తెలిపారు. గత ఏడాది మహా శివరాత్రి పర్వదినంలోపే ఆలయం పూ ర్తిగా జలాధివాసం నుంచి బయట పడింది. కానీ, ఈ ఏడాది మహాశివరాత్రి ముగిసి 15 రోజులు గడుస్తున్నా మరో 15 రోజుల గడిస్తేగాని ఆలయం పూర్తిగా బయటపడే పరిస్థితి లేదు. అప్పుడు పూర్తి స్థాయిలో భక్తులు దర్శించుకునే అవకాశం ఉంటుంది.



సంగమేశ్వర గర్భాలయంలో వేప దారు శివలింగానికి పూజలు చేస్తున్న ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామయ్య శర్మ

మామిడి తోట దగ్ధం

» కాలిపోయిన 450 చెట్లు



కాలిపోయిన మామిడి తోటలో ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు

వీపన గండ్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, వీప నగండ్ల మండల కేంద్రం సమీపంలో ఓ మామిడి తోట దగ్ధమైంది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన సంఘనమోని పెద్ద శేషన్న, చిన్న శేషన్న, వెంకటయ్య, మిద్దె వెంకటయ్యకు చెందిన మామిడి తోటకు సోమవారం నిప్పంటుకున్నది. దీంతో 450 మామిడి చెట్లు, స్టార్టర్, ట్రాన్స్‌ఫార్మర్, 55 పైపులు, తీగ పూర్తిగా కాలిపోవడంతో దాదాపు రూ.10 లక్షలు నష్టం వాటిల్లింది. ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయా? ఎవరైనా తగులబెట్టారా తెలియదని బాధితులు తెలిపారు. కాయ చేతికొచ్చే దశలో తోట కాలిపోవడంతో పూర్తిగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

కారు బోల్తా, దంపతులకు గాయాలు

బిజినేపల్లి, మార్చి (ఆంధ్రజ్యోతి) 17 : కారు అదుపుతప్పి బోల్తా పడటంతో దంపతులు గాయపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండల కేంద్రంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. తిమ్మాజీపేట మండలం, ఇప్పలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని హనుమాన్ తండా మాజీ సర్పంచ్ సత్యం నాయక్, ఆయన భార్య కారులో బిజినేపల్లికి వస్తున్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం సమీపంలో కారు టైర్ పేలిపోవడంతో అదుపు తప్పి రోడ్డు కిందకు దిగి బోల్తా పడింది. బెలూన్స్ తెరుచుకోవడంతో దంపతులు ఇద్దరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, వారిని మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ ఆసుపత్రికి తరలించారు.

వరకట్న వేధింపుల వల్లే చర్చిత ఆత్మహత్య

- తల్లి రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు

జడ్చర్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వరకట్న వేధింపుల వల్లే తన కుమార్తె చర్చిత(22) ఆత్మహత్య చేసుకున్నదని ఆమె తల్లి సూర్నపాక రాధిక ఫిర్యాదు చేసినట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, యెల్లెందు మండలం, సుడిమల్ల గ్రామానికి చెందిన రాధిక, సుధాకర్ దంపతులకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తె చర్చిత యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరిలోని ఫార్మసీ కళాశాలలో ఎం ఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమెతో పాటు చదువుకుంటున్న జడ్చర్ల మండలం గొల్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రాళ్లగడ్డతండాకు చెందిన ఆంగోత్ పవన్ ప్రేమించుకున్నారు. జనవరి 31న పవన్ ఇంటి వద్ద వివాహం చేసుకున్నారు. రూ.10 లక్షల వరకట్నం తీసుకొస్తేనే పెళ్లికి రావాలని పవన్ తల్లిదండ్రులు స్పష్టం చేశారు. అంత ఆర్థిక స్థోమత లేని చర్చిత తల్లిదండ్రులు పెళ్లికి వెళ్లలేదు. ఆ తర్వాత వరకట్నం కోసం భర్త అత్తమామలు ఆంగోత్ రజిత, ఆంగోత్ రాములునాయక్, పవన్ బాబాయ్, పిన్నిలు అర్చితను వేధించారు. ఈ విషయాన్ని చర్చిత తమకు ఫోన్ చేసి చెప్పిందని తల్లి రాధిక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నది. వేధింపులు భరించలేక ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

ఇంటర్వ్యూ..

పెండింగ్ దరఖాస్తులను పరిశీలిస్తున్నాం

» తహసీల్దార్ విజయలక్ష్మి



భూత్పూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తును సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తున్నట్లు తహసీల్దార్ విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

ధరణిలో ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి?

గతంలో నేను రాక ముందు ధరణిలో 120 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, ఇప్పటికీ 70 దరఖాస్తులు పరిష్కరించాం. ఇంకా 50 త్వరితగతిన పరిష్కరిస్తాం.

అధికారులు అందుబాటులో లేరన్న ఆరోపణ ఉంది?

కలెక్టర్ ఆదేశాల మేరకు డబల్ బెడ్ రూం ఇళ్ల తనిఖీల్లో విధులు నిర్వహించడంతో అందుబాటులో ఉండటం లేదు.

రేషన్ సరిగ్గా అందుతుందా?

మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి నెల మొదటి వారంలో ప్రజలకు రేషన్ అందుతుంది. మండలంలో మొత్తం 12,832 రేషన్ కార్డులు ఉన్నాయి.

బొడ్రాయి ప్రతిష్ఠాపన

హన్వాడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సల్లోనిపల్లిలో మూడు రోజులుగా ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం బొడ్రాయితో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు.

'ఎంపీ ఇంటికే భద్రత లేకుంటే ఎలా'

హన్వాడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో బీజేపీ జాతీయ నాయకురాలు ఎంపీ డీకే అరుణ ఇంట్లో చొరబడిన ఆగంతకుడిని గుర్తించి శిక్షించాలని, ఎంపీ ఇంటికే భద్రత లేకుంటే సామాన్యుల పరిస్థితి ఏంటని బీజేపీ మండల నాయకుడు రఘురాంగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని పెద్దదర్పల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

రైతులను ఆదుకోవాలి

పాలమూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టి.సాగర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ విజయేందిర బోయిని కలిసి నీరు అందక పంటలు ఎండిపోయి నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వరి పంటకు రూ.25 వేలు, వాణిజ్య పంటకు ఎకరాకు రూ.50 వేలు అందజేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, కిల్లె గోపాల్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మూసాపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామానికి చెందిన గౌరెల కాపరి సత్యంయాదవ్ చెట్టుపై నుంచి జారిపడి ప్రమాదవశాత్తు గాయపడి యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బీఆర్ఎస్ నాయకుడు విజయకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి సోమవారం రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

గండీడ్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని హెచ్‌ఎం వీరసేనగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని చిన్నవార్వల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదవ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు అందజేశారు.

పది విద్యార్థులకు వీడ్కోలు

జడ్చర్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం కోడ్గల్ జడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. హెచ్‌ఎం మారేపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకొని ముందుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వీధి కుక్కల తరలింపు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ విజయేందిర బోయి, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం వీధి కుక్కలను పట్టుకొని తరలించారు. బండమీదిపల్లిలోని వడ్డెర బస్తీ, బుడగజంగాల కాలనీ, బ్యాంకుకాలనీ, జమ్ములనమ్మనగర్ కాలనీ, హనుమాన్‌పుర కాలనీల్లో వీధి కుక్కలను వలలతో బంధించి వ్యానులోకి ఇతర ప్రాంతాలకు తరలించారు.

కనీస వేతనం ఇవ్వాలి

రాజాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని సోమవారం తహసీల్దార్ విద్యాసాగర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పని భారాన్ని పెంచి, పారితోషికం పేరుతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారన్నారు. మళ్లీ గ్రామాల్లో సర్వే చేయమని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సావిత్రి, అమృత, సర్వమ్మ, రాధ, నాగమణి పాల్గొన్నారు.

కరుగుతున్న గుట్టలు

» చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు

» పేలుళ్లతో బెంబేలెత్తుతున్న ప్రజలు



గోవిందుపల్లిలో కొండను తవ్విన దృశ్యం

గండీడ్/మహమ్మదాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : అనుమతుల పేరుతో కొందరు అక్రమార్కులు గుట్టలను కరగదీస్తున్నారు.. ఇందుకోసం క్రషర్, గ్రానైట్, గ్రావెల్ క్వారీల యజమానులు విచ్చలవిడిగా డిటోనేటర్లు, జిలెటిన్‌స్టిక్స్, పవర్ బూస్టర్స్ వంటి పేలుడు పదార్థాలను వినియోగిస్తున్నా.. సంబంధిత అధికారులు చూసిచూడనట్టు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. వాస్తవానికి మైనింగ్ శాఖ అనుమతితో లైసెన్స్ ఉన్న వ్యాపారుల నుంచి పేలుడు పదార్థాలు కొనుగోలు చేసి, పోలీసుల అనుమతితో క్వారీల్లో వినియోగించాలి. కానీ గండీడ్ మండలంలోని గోవిందుపల్లి, రంగారెడ్డిపల్లి గ్రామాల శివారులో ఉన్న క్రషర్ యాజమానులు పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పేలుడు పదార్థాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంతో విచ్చలవిడిగా పేలుడు పదార్థాలను కొనుగోలు చేసి, వాటికి అక్రమంగా నిల్వ ఉంచడంతో పాటు ఎప్పుడుపడితే అప్పుడు గుట్టలను పేల్చడంతో శబ్ద కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సంబంధిత గ్రామాలు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టాలి

» అధికారుల సమావేశంలో కలెక్టర్ విజయేందిర బోయి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలం పూర్తయ్యే వరకు తాగునీరు, విద్యుత్ సరఫరాపై అధికారులు దృష్టి పెట్టాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. ఇప్పటికే 1300 ఎకరాల్లో పాక్షికంగా, 500 ఎకరాల్లో పంటలు పూర్తిగా ఎండిపోయాయని తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశపు మందిరంలో నిర్వహించిన జిల్లా అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓర్, ఎంపీడీవోలతో మండల ప్రత్యేకాధికారులు తాగునీరు, విద్యుత్ సరఫరాపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని, పంటల పరిస్థితులపై ఆరా తీయాలని సూచించారు. పంటలు ఎండిపోకుండా రైతులతో మాట్లాడి నీటి వృథా, పొదుపు, ప్రత్యామ్నాయ నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని సూచించారు. 16 మండలాల్లోని 16 గ్రామ పంచాయతీల్లో ఎంపిక చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్క్ అవుట్ చేసిన గ్రౌండింగ్ ను వేగవంతం చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాన్ని మొదట 10 పాఠశాలల్లో ప్రారంభించామని, మిగతా 43 పాఠశాలల్లో కూడా ఈ కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా లోక్ భారతి ఎడ్యుకేషన్ సొసైటీ, అరగెన్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో టీబీ రోగులకు అందజేస్తున్న నిక్షయ్ పోషణ కిట్లను (33 ఆహార బాస్కెట్లను) కలెక్టర్ అందజేశారు. అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, జడ్పీ సీఈవో వెంకటరెడ్డి, డీఎంహెచ్‌వో కృష్ణ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి..

ప్రజా ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 130 ఫిర్యాదులు రాగా, గత ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారాలను పరిశీలిస్తూ ఆయా శాఖల వారీగా ఉన్న పెండింగ్ ఫిర్యాదులపై ఆరా తీశారు. పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో నవీన్ కుమార్, అర్బన్ తహసీల్దార్ ఘాన్సీరామ్ పాల్గొన్నారు. అంతకుముందు నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన తాగునీరు, అంబలి కేంద్రాలను కలెక్టర్ ప్రాంభించారు.

బాధితులకు న్యాయం చేయాలి : ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : అన్యాయానికి గురైన బాధితులే పోలీస్‌స్టేషన్‌లకు వస్తుంటారని, అలాంటి వారికి న్యాయం చేయాల్సిన అవసరం పోలీసులపై ఉందని ఎస్పీ జానకి అన్నారు. సోమవారం ప్రజావాణిని పురస్కరించుకుని ఎస్పీ తన కార్యాలయంలో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి 15 ఫిర్యాదులు వచ్చాయి. బాధితులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందన్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సమయంలో డయల్ 100, 1930కి కాల్ చేయాలన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

హన్వాడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాభివృద్ధికి కోసం కేంద్రం నిరంతరం పనిచేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీ నిధులతో వేపూర్ నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. మండల అధ్యక్షుడు వెంకటయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ బుచ్చిరెడ్డి, ఇన్‌చార్జి అంజయ్య పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ మండలంలోని రామచంద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పండుగ సాయన్న సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. సేవా సంస్థ మహబూబ్‌నగర్ రూరల్ మండల అధ్యక్షుడు పద్మ నరేష్ ముదిరాజ్, సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జడ్చర్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగంపేటలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు జగన్ మాట్లాడుతూ గ్రామంలోని 4, 7వ వార్డుల్లో డ్రైనేజీ నిర్మాణం చేపట్టకపోవడంతో రోడ్డుపై మురుగునీరు పారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శి రంజిత్‌కు వినతిపత్రం అందచేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జడ్చర్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం ఉదండాపూర్ గ్రామానికి చెందిన గడ్డ బాలయ్య (62) చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడని జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. మతిస్థిమితం సరిగ్గా లేని బాలయ్య ఆదివారం నీళ్లు అనుకుని ఫినాయిల్ తాగి, జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడని కోడలు అంజమ్మ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

సోదరభావంతో పండుగలు జరుపుకుందాం



ముస్లిం సోదరుడికి పండు తినిపిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మార్చి, 17 (ఆంధ్రజ్యోతి) : సోదరభావంతో కలిసిమెలిసి పండుగలు జరుపుకుందామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కాంగ్రెస్ నాయకుడు ఎన్పీ వెంకటేష్ గృహంలో ముస్లిం సోదరులకు ఇచ్చిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితరెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్, డీసీసీ కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, సీజే బెనహర్, నాయకులు అవేజ్, అజ్మత్ అలీ, సాయిబాబా, ఫయాజ్, షబ్బీర్ అహ్మద్, అంజద్, రాషెద్‌ఖాన్, ఖాజాపాషా, లక్ష్మణ్ నాయక్, అర్షద్ అలి, నవనీత, ఫయిం, ఫైసల్, చంద్రమౌళి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సహకరించాలి

చిన్నచింతకుంట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహకరించాలని ఎంఈవో మురళీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విద్యాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జీపీఎస్ పాఠశాలకు ఎల్ఈడీ టీవీని దాత సల్గుటి విష్ణువర్ధన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో దాతను శాలువాతో సన్మానించారు.

ఆనంద్‌శర్మకు బ్రాహ్మణ సంఘాల నైతిక మద్దతు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ కుట్రలో భాగంగా ఐదవ శక్తి పీఠం జోగులాంబ ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న ఆనంద్ శర్మను వ్యక్తిగత దూషణలకు పాల్పడడాన్ని బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో ఖండిస్తున్నామని, నైతిక మద్దతు ప్రకటిస్తున్నట్లు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బ్రాహ్మణ సంఘాలు ప్రకటించాయి. సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలోని సూర్యలక్ష్మీ కాటన్ మిల్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆనంద్ శర్మకు మద్దతుగా బ్రాహ్మణ సంఘాలు సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గొండ్యాల రాఘవేంద్ర శర్మ మాట్లాడుతూ బ్రాహ్మణేతరులు బ్రాహ్మణులపై వ్యక్తిగత దూషణలకు పాల్పడమే కాకుండా, ఇతర అభియోగాలు మోపుతున్నారన్నారు. శ్రీకాంత్ శర్మ, జోషి, సంతోషాచార్యులు, వాయి ప్రదీప్ పాల్గొన్నారు.

బొటానికల్ గార్డెన్ సందర్శన

జడ్చర్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌ను సోమవారం ఆలంపూర్ పట్టణంలోని విశ్వశాంతి డిగ్రీ కళాశాల బాటనీ విద్యార్థులు సందర్శించారు. బొటానికల్ గార్డెన్ ఐదవ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బాటనీ అధ్యాపకురాలు శశికళ ఆధ్వర్యంలో విద్యార్థులు సందర్శించారు. బొటానికల్ గార్డెన్ గురించి కోఆర్డినేటర్ డాక్టర్ సదాశివయ్య వివరించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రాహుల్, రవీందర్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల వినూత్న నిరసన



మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జడ్చర్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీలో జరిగే ప్రత్యేక సమావేశంలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి జంగయ్య మాదిగ డిమాండ్ చేశారు. జడ్చర్ల పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్షలు సోమవారం కొనసాగగా, నాయకులు మోకాళ్లపై కూర్చుని వినూత్న నిరసన చేపట్టారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కొంగళి నాగరాజు, కరాటే శ్రీను, వినోద్‌కుమార్, యాదయ్య, రాజేష్, రమేశ్, చెన్నకేశవులు, సురేశ్, జయరాజ్, వంశీ పాల్గొన్నారు. అంతకు ముందు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలను కాంగ్రెస్ నాయకుడు అల్వాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కోడ్గల్ యాదయ్య రిలే దీక్షలో కూర్చున్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు. విరమింపచేసిన వారిలో నాయకులు రఘుపతిరెడ్డి, ఇంతియాజ్‌ఖాన్ ఉన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్షలు

పాలమూరు : ఎస్సీ వర్గీకరణ తరువాతనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు సోమవారంతో 7వ రోజుకు చేరాయి. దీక్షకు మద్దతుగా దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, బిచ్చునాయక్, నరేందర్‌శెట్టి, శ్రీనివాస్, మధుబాబు, బాలరాజు, పోలే బాలయ్య, కొమ్ము కొండయ్య, కాన్షీరామ్, రాంచందర్, నాగయ్య, శేఖర్, ఎమ్మార్పీఎస్ నాయకుడు శ్రీరాములు పాల్గొన్నారు.

పీఎంశ్రీ సెంటర్‌ను ఉపసంహరించుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టిన అంగన్‌వాడీలు

పాలమూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ మొబైల్ సెంటర్లను, ఎన్ఈపీని ఉపసంహరించుకోవాలని అంగన్‌వాడీలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో 48 గంటల ధర్నాలో భాగంగా మొదటి రోజు ధర్నా చేపట్టారు. కేంద్రంలోని బీజేపీ ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయటానికి పీఎంశ్రీ మొబైల్ సెంటర్లను నూతన విధానంలో భాగంగా అంగన్‌వాడీ సెంటర్లను ప్రైవేటీకరరించడానికి ఐసీడీఎస్‌లో అనేక మార్పులు చేస్తున్నారని తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు సరోజ, ఉపాధ్యక్షురాలు కమల మాట్లాడుతూ ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయడంలో భాగంగానే మొబైల్ సెంటర్‌ను, బడ్జెట్ తగ్గించటం కేంద్ర ప్రభుత్వం అడుగు వేసిందన్నారు. ఎండాకాలంలో ప్రభుత్వ పాఠశాలలో సమానంగా ఒక పూట బడి, మే నెల టీచర్, ఆయాకు సెలవులు నిర్ణయించాలన్నారు. ఖమర్‌అలీ, వరద గాలెన్న, ఆదివిష్ణు, జహంగీర్ మద్దతు పలికారు. కార్యక్రమంలో గౌసియాబేగం, మహమూద, పద్మ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

మహమ్మదాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మండల వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతన్నా ఇరు మండలాల రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదని సోమవారం కలెక్టర్ విజయేందర బోయికి ఫిర్యాదు చేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు మాచారం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యానాయక్, భిక్షపతి, నాయకులు పెరికిటి వెంకట్‌రామ్‌రెడ్డి, రాజ్‌కుమార్‌రెడ్డి, రాంరెడ్డి ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్‌కు వివరించారు. 15 రోజులుగా గండీడ్ మండలంలోని రంగారెడ్డిపల్లి, పగిడ్యాల్ వాగు నుంచి, మహమ్మదాబాద్ పరిధిలోని ధర్మపూర్, అన్నరెడ్డిపల్లి వాగుల నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తుంటే స్థానిక అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. కలెక్టరే సీసీరోడ్డు పనులకు ఇసుక రవాణాకు అనుమతి ఇచ్చిందని తహసీల్దార్లు, ఎస్ఐలు చెబుతున్నారన్నారు. నాయకులు మాజీ సర్పంచ్‌లు రాములు, నీలేష్, నాయకుడు రాంచంద్రరెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

పాలమూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రెండు నుంచి ఐదు నెలల వేతనాలు ఇవ్వకపోవడం సరికాదని, రాష్ట్రంలోని 60 వేల మంది పంచాయతీ కార్మికులకు రూ.60 కోట్లు లేవా? అని ప్రశ్నించారు. సాంబశివుడు, అరుణ్‌కుమార్, నాగరాజు, బాలు, దేవమ్మ, సూర్యమ్మ, నరసింహ, బాలరాజు, వినోద్, షెడ్రేక్, అరుణ, బాలయ్య వాసమ్మ, అంజయ్య, రాజు, లక్ష్మణ్, సత్యం, తిమ్మయ్య, వెంకట్రాములు, చెన్నయ్య, అంజి, బాలమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

షిరిడీ సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆనంద్ కుమార్

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మార్చి, 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో సోమవారం ఆలయ 17వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్ పాల్గొని బాబా ఆశీస్సులు తీసుకున్నారు. ఆలయ అవరణలో మండప నిర్మాణానికి మునిసిపల్ నిధుల నుంచి రూ.11 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు. సమీపంలో ఉన్న హైగ్రీవ ఆలయాన్ని కూడా రూ.10 లక్షలతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం కాలనీలో పలు సీసీ రోడ్లను ప్రారంభించారు. మాజీ కౌన్సిలర్ రోజా వెంకటేష్ పాల్గొన్నారు.

కాలుష్యం బారి నుంచి కాపాడాలి

జడ్చర్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఫార్మ పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యం నుంచి కాపాడాలంటూ మండలంలోని పెద్దపల్లి సమీపంలోని విర్కో ఫార్మ పరిశ్రమ సోమవారం గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. మండలంలోని పెద్దపల్లి, చిన్నపల్లి, వల్లూరు, ఉదండాపూర్ గ్రామాలకు చెందిన గ్రామస్థులు జడ్చర్ల నుంచి వల్లూరుకు వెళ్లే ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన స్థలానికి జడ్చర్ల ఎస్ఐ చంద్రమోహన్ చేరుకుని గ్రామస్థులను సముదాయించారు. గ్రామస్థులు శ్రీను, రవినాయక్ పాల్గొన్నారు.

వినియోగదారులు హక్కులు తెలుసుకోవాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులు తప్పని సరిగా తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రాజేంద్రప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ వినియోదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన వినియోగదారుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రతీ వినియోగదారుడు తూకం, ధరలలో తేడాలు ఉంటే గమనించాలన్నారు. వినియోగదారుల సమాచార మండలి కన్వీనర్ బాలలింగయ్య, వాణిజ్య శాఖ అధిపతి మధుసూదన్ శర్మ, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి, కిషోర్, వాసంతి, విశాల, సిద్ధయ్య పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్

మహబూబ్‌నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మరో 14 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుందని, నెలాఖరు కల్లా వందశాతం ఆస్తి పన్ను వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నెలాఖరు నాటికి మొండిబకాయిలతో పాటు ప్రస్తుత డిమాండ్ మేరకు వసూళ్లు చేయాలని సూచించారు. ఇప్పటికే కార్పొరేషన్ పరిధిలో చాలా తక్కువగా పన్నుల వసూలు జరిగాయిని, అధికార యంత్రాంగం అంతా వార్డుల వారీగా లిస్టులు పెట్టుకుని వసూలు చేయాలని ఆదేశించారు. కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఆరవ్వే ఖాజామైనొద్దీన్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు ప్రారంభం

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ మహబూబ్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. సోమవారం ఆర్అండ్‌బీ అతిధి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జర్నలిస్టుల సభ్యత్వ నమోదును జిల్లా అడ్‌హక్ కమిటీ సభ్యులు ప్రాంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికిగాను ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో పని చేస్తున్న జర్నలిస్టులు తమ సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. మొదటి రోజు 60 మంది జర్నలిస్టులు తమ సభ్యత్వాన్ని టీయూడబ్ల్యూజె (ఐజేయూ)లో నమోదు చేసుకున్నారని తెలిపారు. రాష్ట్ర నాయకుడు జర్నలిస్ట్ అహ్మద్ పాషా ప్రారంభించగా, జర్నలిస్టులు శేఖర్, పవన్‌కుమార్‌రెడ్డి, ముజీబ్, తిరుపతయ్య, వెంకటేష్, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.